క్లుప్తంగా

సూర్య దేవునికి విశేష అర్చనలు


సూర్యనారాయణ స్వామి

సింహాచలం : మాఘ మాసంలో తొలి ఆదివారంను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురం గోశాల సమీపంలోని సప్త అశ్వవాహన సమేత సూర్యానారాయణ స్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు విశేషంగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. సూర్య నమస్కారాలు చేశారు. ఆదిత్య పఠన పారాయణ చేశారు.

సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న సత్యనారాయణ స్వామి

పెందుర్తి: పెందుర్తి సాధుమఠం వద్ద ఉన్న రమా సత్యనారాయణస్వామి ఆలయంలో మాఘమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణ శర్మ, రాజ ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

ఆదిత్యునికి అభిషేకాలు


సుజాతనగర్‌లో పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి : మాఘ మాసోత్సవాల్లో భాగంగా సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులతో స్వహస్తాలతో పాయసం వండించి స్వామికి నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతి ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెందుర్తి : నగరంలో జరిగిన జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో పెందుర్తిలోని యూనిక్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి జూనియర్, సీనియర్ అబాకస్‌లో మొదటి స్థానం, వేదిక్ మ్యాథ్స్‌లో మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. విజేతలు వర్షిత్, ఆదిత్య, లిఖిత, నిత్యశ్రీ, అమృత గౌరీసాయిలను ప్రిన్సిపాల్ కోనేటి ఆదినారాయణ, సిబ్బంది అభినందించారు.

అనుమతులు లేని దాబాలపై పోలీసుల దాడి

పరవాడ : మండలంలోని పరవాడలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రెండు దాబాలపై పోలీస్‌లు ఆదివారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా పరవాడ సీఐ ఎస్. బాలసూర్యారావు మాట్లాడుతూ అనుమతి లేని దాబాలలో మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

రహదారికి మహర్దశ

- రూ.9.75 కోట్లతో సబ్బవరం– గుల్లేపల్లి రోడ్డు విస్తరణ
- 60 అడుగులు.. రెండు వరుసలుగా నిర్మాణం
- 13 చోట్ల కల్వర్టులు, ఒక ప్రాంతంలో కాజ్‌వే
- చురుగ్గా సాగుతున్న పనులు


అంతకాపల్లి రోడ్డు సమీపంలో శరవేగంగా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు


ఆదిరెడ్డిపాలెం సమీపంలో పొక్లెయిన్‌తో పనులు చేస్తున్న సిబ్బంది


సబ్బవరంలోని కొత్తరోడ్డు జంక్షన్ వద్ద రెండు వరుసలుగా విస్తరిస్తున్న సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డు

సబ్బవరం: సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డుకు మహర్దశ పట్టనుంది. సుమారు రూ.9.75 కోట్లతో రహదారిని విస్తరించనున్నారు. సబ్బవరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రధానమైన ఈ రహదారిని అభివృద్ధి చేస్తుండటంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. ఈ రోడ్డును 60 అడుగుల వెడల్పుతో, రెండు వరుసలుగా విస్తరిస్తున్నారు. మండలంలోని కీలకమైన ఈ రోడ్డు విస్తరణతో మండలవాసులతో పాటు ఈ మార్గంలో నిత్యం ప్రయాణించే వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


గుల్లేపల్లి సమీపంలో చురుగ్గా సాగుతున్న కల్వర్టు పనులు

సరిహద్దు జిల్లాల రోడ్లకు అనుసంధానం

ఈ రోడ్డు పలు మండలాలతో పాటు సరిహద్దు జిల్లాల రోడ్లను అనుసంధానం చేస్తుంది. సబ్బవరం జాతీయ రహదారితో పాటు కోటపాడు–పినగాడి రోడ్డుకు.. అలాగే విజయనగరం జిల్లాలోని కొత్తవలస రోడ్డుకు అనుసంధానం కానుంది.

హామీని నెరవేరుస్తూ..

ప్రతిపక్ష నేత హోదాలో ప్రజా సంకల్పయాత్ర చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సబ్బవరంలో నిర్వహించిన బహిరంగ సభకు గుల్లేపల్లి నుంచి సబ్బవరం రోడ్డు మీదుగానే వెళ్లారు. ఇరుగ్గా ఉన్న ఈ ప్రధాన రహదారిని అధికారం చేపట్టిన తర్వాత విస్తరిస్తామని హామీ ఇచ్చారు. దానిని నెరవేర్చారు. రోడ్డు విస్తరణ పనులకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇటీవల శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

విస్తరణ ఇలా..

- రహదారి అభివృద్ధికి సుమారు రూ.9.75 కోట్లు వీఎంఆర్‌డీఏ నిధులు మంజూరు చేశారు.
- రూ.5.71 కోట్లతో 60 అడుగుల వెడల్పున రెండు వరసల రహదారిగా విస్తరించనున్నారు.
- ఆదిరెడ్డిపాలెం సమీపంలో కాజ్‌వేతో పాటు రోడ్డు పొడవునా 13 చోట్ల శ్లాబ్, పైపు కల్వర్టులు నిర్మించనున్నారు.
- ప్రస్తుతం కల్వర్టుల నిర్మాణం తుదిదశకు చేరుకుంది. మరో రూ.4 కోట్లతో మేజర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు.

ఇరుకు రోడ్డులో ఇబ్బంది పడేవాళ్లం



సబ్బవరం – గుల్లేపల్లి రోడ్డు ఇరుగ్గా ఉండటంతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోడ్డు విస్తరణతో ఆదిరెడ్డిపాలెం, గుల్లేపల్లి, అంతకాపల్లి, రావలమ్మపాలెం, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, అయ్యన్నపాలెం, బోదువలస, ఎల్లుప్పి తదితర ప్రాంతాల ప్రజలకు ఎంతో మార్గం సుగమం అవుతుంది.

– బోకం రామునాయుడు, గుల్లేపల్లి

ఇక ప్రమాదాలకు చెక్



నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు శిథిలావస్థలో ఉండటంతో తరచూ ప్రమాదాలు సంభవించేవి. ఇప్పుడు రోడ్డును బాగా వెడల్పు చేస్తున్నారు. రెండు లైన్లుగా విస్తరిస్తుండటంతో ప్రమాదాలకు చెక్ పడనుంది. రోడ్డు నిర్మాణం పూర్తయితే మా ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరం.

– బుదిరెడ్డి రామకృష్ణ, అయ్యన్నపాలెం గ్రామం

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.2.12 లక్షల విరాళం



అన్నప్రసాదానికి విరాళం అందజేసిన దాతలకు బాండ్లు అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన పిల్లా భాస్కరరావు దంపతులు రూ.1,01,116లు, మద్రిపాలెం ప్రాంతానికి చెందిన ఎం.సీతాపతిరావు రూ.1,11,111లు విరాళంగా అందజేశారు. సింహగిరికి కుటుంబ సమేతంగా వచ్చిన దాతలు సంబంధిత విరాళాలను నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు అన్నప్రసాదం పథకం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్‌లు అందజేశారు.

దేవీపురంలో శ్యామ నవరాత్రి ఉత్సవాలు


దేవీపురంలో తమలపాకుల అలంకరణలో రాజశ్యామల అమ్మవారు

సబ్బవరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో శ్యామ నవ రాత్రి ఉత్సవాలు రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజశ్యామల అమ్మవారు తమలపాకులతో ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారికి సకల అరిష్టాలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

సింహాచలేశునికి స్వర్ణ సంపెంగలతో అర్చన


స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు


నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీత ధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. అందులో భాగంగా స్వామివారికి ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన చేశారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

సమ్మె విజయవంతానికి పిలుపు


కరపత్రాలతో సత్యనారాయణ, తదితరులు

పరవాడ : డ్రైవర్ల పాలిట ఉరితాడు లాంటి ప్రమాదకర చట్టంలోని నిబంధనలు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ మండలంలోని లంకెలపాలెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం అనకాపల్లి జిల్లా ఆటో కార్మిక సంఘం నిర్వహించిన సమ్మెలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీఎన్ఎస్ చట్టం తీసుకురావడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 16న మోటార్ కార్మికులు నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోటార్ కార్మికుల సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, తద్వారా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మెకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నర్సింగరావు, రామారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

35 మద్యం బాటిళ్లు స్వాధీనం

పరవాడ : అక్రమ మద్యం కేసులో పరవాడ పోలీసులు ఆదివారం ముగ్గురిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 35 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని లంకెలపాలెం గ్రామానికి చెందిన జోగి నూకాలమ్మ పాన్‌షాపులో అక్రమంగా మద్యం అమ్ముతుందని అందిన సమాచారంతో పరవాడ ఎస్ఐ ఎస్.సురేష్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. తనిఖీల్లో రూ.2,600 విలువ చేసే 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఫార్మాసిటీకి చెందిన సి.నరసింగరావు వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా లంకెలపాలెంలోని వినాయకనగర్ ఎస్ఐ మల్లేశ్వరరావు సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.2,520 విలువ చేసే 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని వెన్నెలపాలెంకు చెందిన దొడ్డి మహాలక్ష్మి నాయుడు వైన్‌షాప్‌లో మద్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.1,580 విలువ చేసే 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

క్రీడా ఆణి‘ముత్యం లక్ష్మి’

జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో బంగారు, వెండి పతకాలు


బంగారం, వెండి పతకాలు సాధించిన ముత్యం లక్ష్మి

చోడవరం: జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో చోడవరానికి చెందిన వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి బంగారం, సిల్వర్ పతకాలు సాధించారు. 5వ జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు హైదరాబాద్‌లో ఈనెల 7నుంచి 11వతేదీ వరకూ జరిగాయి. ఈ పోటీల్లో జావెలిన్ త్రో, డిస్క్ త్రో, షాట్‌పుట్ విభాగాల్లో 75 ఏళ్ల వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి పాల్గొని, ప్రతిభ కనబరిచారు. జావెలిన్ త్రోలో బంగారు పతకం, డిస్క్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో వెండి పతకాలు సాధించారు. ఈమె ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడల్లో అనేక సార్లు పాల్గొని వివిధ విభాగాల్లో పలు పతకాలు సాధించారు. తాజాగా జరిగిన జాతీయ పోటీల్లో కూడా ముత్యం లక్ష్మి పతకాలు సాధించడంతో చోడవరం ప్రజలు, క్రీడాకారులు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

ఆధ్యాత్మిక చింతనతోనే చింతలు దూరం


ప్రవచనాలు వింటున్న భక్తులు


యాగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామి

దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి

అనకాపల్లి: చింతామణి గణపతి ఆరాధన, ఆధ్యాత్మిక చింతనతో .. చింతలన్నీ దూరమవుతాయని దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి కొత్తూరు చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం మహాగణపతి యాగం, ప్రధాన దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న స్వామి, అనంతరం ప్రవచించారు. దేశం, రాష్ట్రం పాడిపంటలతో సస్యశామలంగా ఉండి, ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. గణపతి దత్తక్షేత్రాన్ని 1992లో నిర్మించి, చింతామణి గణపతి, రామాలయం, శివాలయం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 12 సంవత్సరాలకొకసారి ఆలయాల్లో దేవతామూర్తులకు కుంభాభిషేకం చేయాలని, మానవుని జీవితంలో ప్రతి ఒక్కరికీ 12 సంవత్సరాలకొకసారి కాలచక్రం మారుతుందన్నారు. కాలచక్రం మారుతున్నప్పుడల్లా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంచుకోవాలని సూచించారు. చింతామణి గణపతిని ప్రార్థించడం ద్వారా చింతలన్నీ దూరమవుతాయని తెలిపారు.

అంతకు ముందు ఉదయం చక్రార్చన, యాగ పూర్ణాహుతి, దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం, ప్రసాద వితరణ, సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గత మూడు రోజులుగా ఇక్కడ ఆలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకులు ఆంజనేయరాజు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం


పరీక్ష కేంద్రంలో మెడికల్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఈవో సుజాత

అనకాపల్లి: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 60 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు మొదటి రోజు 3,074 మందికి గాను 2,943 మంది విద్యార్థులు హాజరయ్యారు. 131 మంది గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి(డీఐఈవో) వి.సుజాత చెప్పారు. ఈనెల 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు.

ప్రీమియర్ లీగ్ టోర్నీ విజేత స్టీల్ టైటాన్స్


స్టీల్ టైటాన్స్ జట్టుకు షీల్డు అందజేస్తున్న అతిథులు

ఉక్కునగరం: ఉక్కు ఎంప్లాయిస్ ప్రీమియం లీగ్ టోర్నమెంట్‌లో స్టీల్ టైటాన్స్ జట్టు విజేతగా నిలిచింది. స్థానిక ఉక్కు స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో స్టీల్ వారియర్స్, స్టీల్ టైటాన్స్, స్టీల్ ఎవెంజర్స్, ఉక్కు రాయల్స్, ఉక్కు సూపర్ గ్రీన్ జట్లు పాల్గొన్నాయి. 11 రోజుల పాటు జరిగిన టీ 20 క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. స్టీల్ టైటాన్స్, ఉక్కు రాయల్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్టీల్ టైటాన్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్ జట్టు 19 ఓవర్లలో 143 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్టీల్ టైటాన్స్ జట్టు 18.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి, లక్ష్యాన్ని ఛేదించింది. టైటాన్స్ జట్టుకు చెందిన బ్యాట్స్‌మన్ యు. రమేష్ 50 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, కోక్‌ఓవెన్స్ జీఎం ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఏసీఎస్ విభాగం జీఎం వి. చిట్టిబాబు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెంటార్ ఇ. వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

‘ఉక్కు’ పరిరక్షణ .. అందరి బాధ్యత

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, దానిని కాపాడుకునేందుకు తెలుగువారంతా పోరాటానికి సిద్ధం కావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారానికి 1095వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తే స్టీల్‌ప్లాంట్ అంశంలో సానుకూల స్పందన లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలన వల్ల దేశ ప్రజలు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారని ఆరోపించారు. లక్షల కంపెనీలు మూతపడ్డాయని, కార్మికులు పనిలేక రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులను మోసం చేస్తోందని, కార్మికులకు పనిలేకుండా చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఎంతటి త్యాగానికైన సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

వీర పరాక్రమ ధీరుడు హనుమంతుడు


సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

ఎంవీపీకాలనీ: సామవేదం షణ్ముఖ శర్మ హనుమద్వైభవ ప్రవచనాలు ఎంవీపీ కాలనీలో ఆదివారం కొనసాగాయి. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా షణ్ముఖ శర్మ హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో హనుమద్వైభవ ప్రవచనాలు నాలుగు రోజులుగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ మహావీర, పరాక్రమ, ధీరుడు హనుమంతుడు అని చెప్పారు. శ్రీ తులసీదాస్ మానవాళికి అందించిన హనుమాన్ చాలీసా జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఒడిసిపట్టుకోడంతో పాటు పిల్లలకు తెలియజెప్పాలన్నారు. దీని ద్వారా మానసిక స్థైర్యం లభిస్తుందని చెప్పారు. ప్రవచనాలతో పాటు ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. కార్యక్రమంలో వందలాది మంది పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు.